సాక్షి నిజామాబాద్

శనివారం ౹ 30 ౹ సెప్టెంబర్ ౹ 2023



గోవిందా.. హరిగోవిందా..

జిల్లా కేంద్రంలో 14 రోజులపాటు కొనసాగిన జెండాబాలాజీ ఆలయ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి.

- 8లో ▸



ప్రాణంతీసిన భూ పంచాయితీ

14 గుంటల భూమికోసం జరిగిన గొడవలో ఓ నిండు ప్రాణం బలైంది. కేసు కోర్టులో ఉండగానే ఘటన చోటుచేసుకుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /24.6

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 10 వేల క్యూసెక్కుల రాక



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 10వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,404.98 అడుగుల(17.773 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

ఓటింగ్‌లో పాల్గొనాలి



సుభాష్‌నగర్: ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గేయాన్ని రూపొందించారు. జిల్లా సాంస్కృతిక సమన్వయకర్త ఆష్ట గంగాధర్ స్వరపర్చిన గేయం సీడీని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రేంజ్ ఐజీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సింహాచలం, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజ్, ఏసీపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షం

సుభాష్‌నగర్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. నగరంతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. బాల్కొండలో 44.3 మిల్లీమీటర్లు, మోర్తాడ్ 40.0, ముప్కాల్‌లో 28.5, సిరికొండ 15.3, వర్నిలో 12.0, ఏర్గట్లలో 11.0, నిజామాబాద్ అర్బన్‌తోపాటు పలుమండలాల్లో మోస్తారు వర్షం కురిసింది. రానున్న రెండు రోజులు జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తారు, భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వాగులో కొట్టుకుపోయిన పశువులు సురక్షితం



తాడ్వాయి: సంతాయిపేట్ శివారులోని భీమేశ్వర వాగులో కొట్టుకుపోయిన పశువులు శుక్రవారం వాగు నుంచి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాయి. గురువారం కురిసిన వర్షానికి భీమేశ్వర వాగు పొంగిప్రవహించడంతో సుమారు 200 పశువులు వాగులో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. చెట్లు, రాళ్లలో ఇరుక్కుపోయిన పశువులు.. నీటి ఉధృతి తగ్గగానే ఒక్కొక్కటిగా బయటకు వచ్చాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు, డెయిరీ డీడీ శ్రీనివాస్ గ్రామానికి వచ్చి పశువులను పరిశీలించారు. ఈ సందర్భంగా సింహారావు మాట్లాడుతూ 162 పశువులకు చికిత్స అందించామన్నారు. 159 పశువులకు ఓ మోస్తరు గాయాలయ్యాయని, మూడు పశువుల పరిస్థితి సీరియస్‌గా ఉందని పేర్కొన్నారు. గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశామని, మూడు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాంచంద్రం, బీఎంసీ చైర్మన్ కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ రమేశ్‌రెడ్డి, వీఎల్‌వో పోచయ్య, జీవీవో కొండల్‌రెడ్డి, గోపాలమిత్రలు బాలు, మహిపాల్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

చెక్కుచెదరని ఆనవాళ్లు


- ఉమ్మెడ శివారులో సజీవంగా నిలిచిన చారిత్రక సాక్ష్యాలు
- శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ నేపథ్యంలో గ్రామం తరలినప్పటికీ పదిలంగా గుర్తులు
- చారిత్రక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న గ్రామస్తులు

గోదావరి తీరంలో 4,500 ఏళ్లనాటి కొత్తరాతి యుగం ఆనవాళ్లు, వెయ్యేళ్ల క్రితం కల్యాణి చాళుక్యుల పాలనాకాలంలో వేసిన శాసనాలు ఉమ్మెడ గ్రామ శివారులో నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గ్రామస్తులు చారిత్రకారులను ఇక్కడికి తీసుకొచ్చి శాసనాలను డీకోడ్ చేయిస్తున్నారు. అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్న తమ ప్రాంతాన్ని పురాతత్వ పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



జైనుల శైలి గణపతి విగ్రహం



కల్యాణి చాళుక్యుల ఉమ్మెడ-1 శాసనం (ఇన్‌సెట్‌లో) పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం

గోదావరి ఒడ్డున నందిపేట మండలం ఉమ్మెడ గ్రామ శివారులో వేల సంవత్సరాల నాటి చారిత్రక ఆనవాళ్లు, దేవుళ్ల విగ్రహాలు, నాటి పాలకుల శాసనాలు చెక్కుచెదరకుండా ఠీవిగా దర్శనమిస్తున్నాయి. గోదావరి తీరంలో 4,500 ఏళ్లనాటి కొత్తరాతి యుగం ఆనవాళ్లతో పాటు వెయ్యేళ్ల క్రితం కల్యాణి చాళుక్యుల పాలనా కాలంలో వేసిన శాసనాలు నాటి జీవన విధానాన్ని తెలిపేవిధంగా ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్‌వాటర్ నేపథ్యంలో ఇక్కడ ఉన్న ఉమ్మెడ గ్రామం సమీపంలోని మెరక ప్రాంతానికి మారింది. అయినప్పటికీ బ్యాక్‌వాటర్ సమీపంలో ఆనాటి చారిత్రక ఆనవాళ్లు నేటితరానికి పదిలమైన గుర్తులుగా ఉన్నాయి. ముంపు నేపథ్యంలో గ్రామం ఇక్కడి నుంచి తరలినప్పటికీ ప్రాచీనకాలంలో విలసిల్లిన నాగరికత చిహ్నాలు మాత్రం అనేక విశేషాలను తెలుపుతున్నాయి.

ప్రాచీన కాలంనాటి ఉమ్మెడ గ్రామంలో విలసిల్లిన ఉమామహేశ్వరాలయం సమీపంలోని ఈ ప్రాంతానికి వెళితే కాలభైరవ స్వామి ఆలయం దర్శనమిస్తుంది. దీనికి ముందుగా అరుదైన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఉంటుంది. రాతి స్తంభానికి నాలుగు వైపులా హనుమంతుని శిల్పాలతో పాటు ఆకాశం వైపు చూస్తున్న హనుమంతుని శిల్పం ఆకట్టుకుంటోంది. ఈ విగ్రహం చూపు తిప్పుకోలేని విధంగా ఉంటుంది. ఇక కాలభైరవ స్వామి ఆలయంలో విగ్రహం ఠీవిగా దర్శనమిస్తుంది. అదేవిధంగా కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో మరో హనుమంతుడి శిల్పం, ఆలయం బయట కుడివైపున ఇంకొక హనుమంతుడి శిల్పం రాతికి చెక్కి ఉన్నాయి. పక్కనే నాగదేవత విగ్రహం కనిపిస్తుంది. ఇక్కడ నాగబంధం ఉందని ఉమ్మెడ గ్రామస్తులు భావిస్తున్నారు. కాలభైరవ స్వామి ఆలయం వెనుక భాగంలో 1008–1014 సంవత్సరాల మధ్య కల్యాణి చాళుక్యుల పాలకుడు 5వ త్రిభువనమల్ల విక్రమాదిత్య వేయించిన శాసనం, దానికి సమీపంలో 1017 సంవత్సరంలో 1వ జగదేకమల్లు వేయించిన శాసనం ఉన్నాయి. వీటి పక్కన నాటి కాలంలో చదునైన పెద్ద రాతిపై గీసిన దీర్ఘచతురస్రాకారంలోని గీతలు, మధ్యలో గుంట, పాము పడగ, దానికి సమాంతరంగా పేర్చి ఉన్న రాళ్లపై సర్పం బొమ్మలు చెక్కి ఉన్నాయి. తరువాత వీటికి వెనుక భాగంలో జైనుల శైలి గణపతి విగ్రహం దర్శనమిస్తోంది. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఉన్న ఈ ప్రాంతంలో వాతావరణం ఆహ్లాదంగా ఉంటుంది. అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్న తమ ప్రాంతాన్ని పురాతత్వ పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ఉమ్మెడ గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామస్తులే ఈ ప్రాంతాన్ని సంరక్షించుకుంటున్నారు. ఇక్కడ ఎవ్వరూ మద్యం సేవించకూడదని సూచిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఇటీవలే చరిత్రకారులను ఇక్కడికి తీసుకొచ్చిన గ్రామస్తులు కొత్తరాతియుగం ఆనవాళ్లను, కల్యాణి చాళుక్యుల శాసనాలను డీకోడ్ చేయించడం ఉమ్మెడ గ్రామస్తుల బలమైన ఆకాంక్షకు నిదర్శనం.



నాగదేవత విగ్రహం

కాలభైరవ స్వామి విగ్రహం



చదునైన రాతిపై చారిత్రక గుర్తులు



కాలభైరవ స్వామి ఆలయం పక్కన హనుమాన్ విగ్రహం



ఆలయ ప్రాంగణంలో హనుమంతుడి విగ్రహం

జయహో జరీన్..

- ఒలింపిక్‌లో బెర్త్..
- జిల్లా నుంచి మొట్టమొదటి క్రీడాకారిణిగా రికార్డు
- ఆసియా క్రీడల్లో సెమీస్‌కు చేరడంతో పతకం ఖాయం



నిజామాబాద్‌నాగారం: పవర్ పంచ్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ.. తనదైన శైలిలో దూసుకెళ్తున్న నిఖత్ జరీన్ ఒలింపిక్‌లో బెర్త్ ఖరారు చేసుకుంది. జిల్లా నుంచి మొట్ట మొదటి క్రీడాకారిణిగా నిఖత్ ఒలింపిక్‌లో ఆడనుంది. చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భాగంగా గురువారం నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో జోడేన్‌కు చెందిన క్రీడాకారిణిని 5–0 తేడాతో చిత్తు చేసింది. దీంతో సెమిస్‌కు చేరడంతో పతకం ఖాయం చేసుకుంది. అక్టోబర్ 1న సెమిస్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన క్రీడాకారిణితో తలపడనుంది. ఇదివరకే థాయ్‌లాండ్‌కు చెందిన క్రీడాకారిణిని ఓడించిన నిఖత్ మరింత ఉత్సాహంతో రింగ్‌లోకి దిగనుంది. జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తుంది. వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సైతం బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. ఒలింపిక్‌లో ఆడాలని గత నాలుగేళ్లుగా కృషి చేస్తున్నా అవకాశాలు రాలేదు. అయినా మొక్కవోని దీక్షతో కఠోరంగా శ్రమిస్తూనే ఉంది. గతంలో 52 కేజీల విభాగంలో నిఖత్ రాణించినా, ఒలింపిక్ వెళ్లాలన్న లక్ష్యంతో తన వెయిట్‌లాస్‌ను కూడా తగ్గించుకొని 50 కేజీల విభాగంలో ప్రత్యర్థులను చిత్తు చేస్తోంది. ఒలింపిక్‌కు అర్హత సాధించిన క్రీడాకారిణిగా నిఖత్‌కు పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఒలింపిక్‌లో పతకం సాధిస్తా : నిఖత్‌జరీన్

ఒలింపిక్‌లో పతకం సాధించాలని గత కొన్నేళ్లుగా కఠోరంగా శ్రమిస్తున్నాను. గతంలో ఒలింపిక్‌లో పాల్గొనే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. అందుకే మరింత కఠోరంగా రింగ్‌లో గంటల తరబడిగా శ్రమిస్తున్నాను. ఆసియా క్రీడల్లో వరుస విజయాలతో సెమీస్‌కు వెళ్లడం, ఒలింపిక్‌లో బెర్త్‌తో చాలా సంతోషంగా ఉంది. ఆసియా క్రీడలో బంగారు పతకం సాధించి తీరుతాను. ఒలింపిక్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ప్రధాని మోదీ సభ నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి
- వీసీలో అధికారులకు సూచన



వీసీలో పాల్గొన్న కలెక్టర్, సీపీ, అధికారులు

సుభాష్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ నిజామాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలో అక్టోబర్ 3న నిర్వహించనున్న పలుకార్యక్రమాల్లో మోదీ పాల్గొననున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో డీజీపీ అంజనీకుమార్ యాదవ్‌తో కలిసి శాంతికుమారి శుక్రవారం జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉన్నతాధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను ప్రారంభించామని సీఎస్‌కు తెలిపారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. లోటుపాట్లకు తావివ్వొద్దని, హెలీపాడ్, కాన్వాయ్, సెక్యూరిటీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

గిరిరాజ్ కళాశాల మైదానం పరిశీలన

ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ నిర్వహించనున్న జీజీ కళాశాల మైదానంలో ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం పలుమార్లు పరిశీలించారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సత్యనారాయణతోపాటు ఎస్‌పీజీ అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌ను ఎస్‌పీజీ అధికారులతో కలిసి పరిశీలించారు.

జక్రాన్‌పల్లిలో ఉద్రిక్తత



మృతదేహంతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు



స్వచ్ఛందంగా దుకాణాలు బంద్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీ

- బ్రెయిన్ డెడ్ అయిన తేజశ్రీ మృతి
- గ్రామస్తుల భారీ ర్యాలీ, రాస్తారోకో
- నిందితుడికి శిక్షపడేలా చేస్తామన్న సీపీ సత్యనారాయణ

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఈ నెల 23న ప్రేమ పేరుతో ఉన్మాది జరిపిన దాడిలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన తేజశ్రీ శుక్రవారం హైదరాబాద్ ఆస్పత్రిలో మృతి చెందింది. దీంతో గ్రామంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకుని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, డీఎస్పీ, ప్రజాపంథా ఆధ్వర్యంలో గ్రామస్తులు తేజశ్రీ మృతదేహంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నిందితుడి ఇంటి సమీపంలోకి రాగానే మృతదేహంతో ఇంటిని ముట్టడించడానికి ఆందోళనకారులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా అరగంటపాటు పోలీసులకు గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. అనంతరం గంటపాటు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రజాసంఘాల పిలుపు మేరకు మండల కేంద్రంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వ్యాపారులు దుకాణాలను ఉదయం నుంచే తెరవలేదు. సీపీ సత్యనారాయణ జక్రాన్‌పల్లికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులు, గ్రామస్తులతో మాట్లాడారు. నిందితుడిపై కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కేసులు నమోదు చేశామన్నారు. శిక్ష పడడానికి అవసరమైన అన్ని ఆధారాలు సేకరించామన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి నిందితుడికి శిక్ష పడేలా మెజిస్ట్రేట్‌ను రిక్వెస్ట్ చేస్తామన్నారు. ఎలాంటి ఒత్తిడిలు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టామన్నారు. నిందితుడికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. దీంతో ఆందోళకారులు రాస్తారోకో విరమించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య మృతురాలి అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం నుంచి ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో సీఆర్‌పీఎఫ్, పోలీసు బలగాలను మోహరించారు. నిందితుడి ఇంటికి కాపలాగా బందోబస్తు ఏర్పాటు చేశారు. తేజశ్రీ అవయవదానానికి కుటుంబసభ్యులు ఒప్పుకోగా, హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ అవయవాలను సేకరించేందుకు ముందుకువచ్చింది. అయితే దాడికారణంగా అవయవాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించి అవయవాలను సేకరించే అవకాశం లేదని చెప్పారు.

లక్ష్మాపూర్‌లో స్పీకర్‌కు చేదు అనుభవం



వర్ని (చందూర్): మండలంలోని లక్ష్మాపూర్‌లో శుక్రవారం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్తులు అడ్డుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మించ తలపెట్టిన స్థలంలో బస్టాండ్ నిర్మించాలని నినాదాలు చేస్తూ స్పీకర్ కాన్వాయిని అడ్డుకున్నారు. వాటర్ ట్యాంక్‌ను వేరే ప్రాంతంలో నిర్మించాలని పాతబస్టాండ్ ప్రాంతంలో కొత్త బస్టాండు లేదా వ్యాపార సముదాయాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

వారివి స్థాయికి మించినమాటలు

- సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ విమర్శ
- ప్రధాని మోదీ బహిరంగసభ ఏరాట్ల పరిశీలన
- పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ సమావేశానికి హాజరు



మీడియాతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సుభాష్‌నగర్: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్థాయికి మించి మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. అక్టోబర్ 3న జిల్లా కేంద్రానికి ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో శుక్రవారం గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో సభాస్థలి వద్ద ఏర్పాట్లను ఈటల పరిశీలించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడారు. ప్రధాని మోదీ ఇప్పటి వరకు తెలంగాణలో అభివృద్ధి పనుల కోసమే వచ్చారని, రాజకీయాల కోసం రాలేదన్నారు. రూ.6,300 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించారన్నారు. ఎన్టీపీసీ ద్వారా 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో తెలంగాణకు విద్యుత్ కొరత లేకుండా చేయాలని నిర్ణయించారని, ఇందులోభాగంగా 800 మెగావాట్ల విద్యుత్‌ప్రాజెక్టును ఇందూరు నుంచి ప్రారంభించనున్నారని తెలిపారు. రెండు నెలల్లో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభిస్తారన్నారు. తొమ్మిదేళ్లలో 3వేల కిలోమీటర్ల హైవేలను నిర్మించి చరిత్ర సృష్టించారన్నారు. ప్రధాని మోదీని ఏం ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారనడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ తన మాటలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ లక్షన్నరకుపైగా జనాలను కార్యకర్తలు తరలించాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీ వెంకటరమణి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లాల అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య, మోరేపల్లి సత్యనారాయణ, లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పెద్దోళ్ల గంగారెడ్డి, దినేశ్ కులాచారి, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



నగరంలో భారీ విగ్రహాల తరలింపు

భారీ విగ్రహాల నిమజ్జనం

గణేశ్ నిమజ్జన ఘట్టం నిజామాబాద్ నగరం, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో రెండోరోజు కొనసాగింది. భారీ విగ్రహాలను శుక్రవారం ఉదయం నుంచి తరలించారు. ఇందుకు గణేశ్ మండళ్ల నిర్వాహకులు తీవ్రంగా శ్రమించారు. నగరంలో రోడ్డుపై విద్యుత్ తీగలను పైకి లేపుతూ విగ్రహాలను బాసర, ఉమ్మెడ గోదావరి నదికి తరలించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

నేడు జిల్లా జట్ల ఎంపిక

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో రూరల్ జోన్ స్కూల్ గేమ్స్ కబడ్డీ, ఖో–ఖో అండర్–14, అండర్–17 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం సుశీల్ కుమార్, పీఈటీ మర్కంటి గంగామోహన్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శనివారం ఉదయం 9.30 గంటల వరకు స్కూల్ బోనాఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. ఎంపిక చేసిన జట్లను అక్టోబర్ 3న బాల్కొండలో నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ, ఖో–ఖో టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు.

ప్రజల సహకారం మరువలేనిది

- సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: జిల్లాలో పండుగల నేపథ్యంలో జరిగిన గణేశ్ నిమజ్జనం, మిలాద్–ఉన్–నబీ వేడుకల్లో ప్రజల సహకారం మరువలేనిదని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని గణేశ్ నిమజ్జన శోభాయాత్ర, మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని వీటికి సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

అర్చకులకు పునశ్చరణ తరగతులు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ధూపదీప నైవేద్య అర్చకులకు అక్టోబర్ 1 నుంచి 3 తేదీ వరకు ఆలయాల్లో నిర్వహించే పూజలపై పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ శుక్రవారం తెలిపారు. శిక్షణ తరగతులు మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 595 అర్చకులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు రాచప్పా, అంజనప్పా ఉన్నారు.

కుక్కల దాడి.. కృష్ణజింకకు తీవ్రగాయాలు



మద్నూర్(జుక్కల్): కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలైన ఘటన డోంగ్లీ మండలంలోని సిర్పూర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని పొలాల్లో కృష్ణజింకపై కుక్కలు దాడి చేయడంతో స్థానికులు వాటిని చెదరగొట్టి పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. కృష్ణజింకను కాపాడిన వారిని గ్రామస్తులు అభినందించారు.

4న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు కమిషనర్ మంద మకరందు తెలిపారు. మేయర్ నీతూకిరణ్ అధ్యక్షతన నూతన మున్సిపల్ భవనంలో సమావేశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బిగాల హాజరు కానున్నట్లు తెలిపారు. కార్పొరేటర్, కోఆప్షన్ సభ్యులు అందరు హాజరు కావాలన్నారు.

రెండో రోజు 'గణేశ్' నిమజ్జనం



నగరంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

నగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం రెండో రోజు కొనసాగింది. నవరాత్రులు మండపాల్లో పూజలందుకున్న గణేశ్ విగ్రహాలను నిర్వాహకులు గురు, శుక్రవారాల్లో నిమజ్జనం చేశారు. డీజే చప్పుళ్లు, కోలాటాల మధ్య గణేశ్ విగ్రహాలను ఊరేగించి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను బాసరకు తరలించారు. పోలీసుల బందోబస్తు మధ్య గణేశ్ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది.

– సాక్షి నెట్‌వర్క్



కంఠేశ్వర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



వీక్లీ బజార్‌లో..





గోల్‌హనుమాన్ ప్రాంతంలో..



సింధి భవన్ ప్రాంతంలో..

ప్రతిష్ఠించిన చోటే..

నిజామాబాద్ సిటీ : జిల్లాలోనే అతిపెద్ద గణపతైన పోచమ్మగల్లీ గణనాథుడి నిమజ్జనం శుక్రవారం రాత్రి పూర్తయింది. 60 అడుగుల ఎత్తుతో నెలకొల్పిన మట్టి విగ్రహాన్ని నిమజ్జనం సందర్భంగా అక్కడే ట్యాంకర్ల ద్వారా నిమజ్జనం చేశారు. సేకరించిన మట్టిని బాసర నదిలో కలుపుతామని మండలి అధ్యక్షుడు నీలగిరి రాజు తెలిపారు.



కోర్టు చౌరస్తాలో..

మేరీ మాటీ - మేరా దేశ్ ప్రారంభం

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు తపాలా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మేరి మట్టి మేరి దేశ్ కార్యక్రమం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు శివాజీనగర్‌కు చెందిన దత్తోపంత్ నాయక్, గంజ్‌రోడ్డుకు చెందిన రాధాకిషన్ మోదాని నివాసాలకు పోస్టల్ సిబ్బంది వెళ్లి మట్టిని సేకరించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపనున్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 10 ప్రాంతాల నుంచి మట్టిని సేకరించినట్లు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజా నర్సగౌడ్ తెలిపారు. నిజామాబాద్ ప్రధాన పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ గోలి గంగాధర్, ఆఫీస్ అసిస్టెంట్ బి. సాయారెడ్డి, పోస్ట్‌మన్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సేకరించిన మట్టితో ఉద్యోగులు

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేలా జిల్లా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీటీడీసీ)లో జిల్లా సమాఖ్య కార్యదర్శి వనిత అధ్యక్షతన 8వ వార్షిక మహాజన సభ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీవో మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు మహిళా సంఘాల్లో చేరకపోతే వారిని సంఘంలో చేరేలా చూడాలన్నారు. సమావేశంలో 2022–23 వార్షిక ప్రగతి నివేదిక, ఆడిట్ రిపోర్ట్, వచ్చే సంవత్సరం వార్షిక కార్యాచరణ, ఆర్థిక ప్రణాళికలను ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు మండల సమాఖ్యల అధ్యక్షులు, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిలు, నీలిమ, ఏపీఎంలు సరోజిని, గంగాధర్, రాజేందర్, జిల్లా సమాఖ్య కోశాధికారి లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజినీర్‌గా రాథోడ్‌శంకర్

నిజామాబాద్‌నాగారం: జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్‌గా రాథోడ్ శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్మూర్ డివిజన్ డిప్యూటీ ఈఈ గా ఉన్న రాథోడ్‌శంకర్ పదోన్నతిపై నిజామాబాద్ ఈఈగా వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఇంజినీర్ బావన్న పదోన్నతిపై ఆర్మూర్ డివిజన్‌కు ఇంజినీర్‌గా వెళ్లారు. ఈసందర్భంగా రాథోడ్‌శంకర్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు.



రాథోడ్‌శంకర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎడపల్లి–జానకంపేట మధ్య ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని ఒకరు మృతిచెందినట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన సోలంకి కృష్ణ(19) బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి గంజాయి సేవించాడు. ఎడపల్లి–జానకంపేట మధ్య రైల్వేట్రాక్ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడు..

రుద్రూర్: చెరువులో చేపట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో పడి మృతి చెందిన ఘటన చిక్కడపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కడపల్లి క్యాంపునకు చెందిన గుడిసె రాజు(33) చేపలు పట్టేందుకు గ్రామ చెరువుకి శుక్రవారం వెళ్లాడు. చేపలు పడుతుండగా నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజు మృతదేహం

దుబాయిలో అడ్లూర్‌వాసి..

కామారెడ్డి రూరల్: బతుకుదెరువు నిమిత్తం దుబా యి వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ని అడ్లూర్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (28), అతని తమ్ముడు రాకేశ్ బతుకుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లారు. దసరా పండుగకు స్వ గ్రామానికి వద్దామనుకున్న తరుణంలో రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా వీరి తల్లీదండ్రులు పదేళ్ల క్రితం చనిపోయారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం సాలంపాడ్ గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. రుద్రూర్ మండలంలోని రాయికూర్‌కు చెందిన గౌరవ్వ(42) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబసభ్యులు దూరంగా ఉంటున్నారు. సాలంపాడ్‌లో ఉంటున్న తన అన్న ఇంటికి ఈ నెల 25న రాగా తిరిగి ఇంటికి చేరుకోలేదు. నిజాంసాగర్ కెనాల్‌లో మహిళ మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా గౌరవ్వ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేటకు చెందిన రంగయ్య మండలంలోని చద్మల్‌లో ఉంటున్న తన అత్తగారింటికి వచ్చి బైక్‌పై వెళ్తుండగా రహదారిపై మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో కిందపడ్డ రంగయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై ప్రేమ్‌చంద్ తెలిపారు.

జంగంపల్లిలో వాల్‌పోస్టర్ కలకలం



భిక్కనూరు: గుర్తు తెలియని వ్యక్తులు అతికించిన వాల్‌పోస్టర్‌తో మండలంలోని జంగంపల్లిలో కలకలం రేపింది. రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ జనార్ధన్‌రెడ్డి జీపీలో కనిపిస్తే కాల్చివేస్తామంటూ వాల్‌పోస్టర్ వెలువడింది. ఈ విషయమై జనార్ధన్‌రెడ్డిని సంప్రదించగా తనకు శత్రువులు ఎవరూ లేరని, తాను ఆధ్యాత్మిక చింతనలో ఉన్నానని తెలిపారు.

వర్సిటీ సమాచారం..

కామర్స్ విద్యార్థికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెయూ కామర్స్ విద్యార్థి కందుకూరి రాము పీహెచ్‌డీ డాక్టరేట్ శుక్రవారం సాధించారు. తెయూ కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు పర్యవేక్షణలో 'భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు' అనే అంశంపై రాము పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం రామును రిజిస్ట్రార్ ఎం యాదగిరి, కామర్స్ డీన్ రాంబాబు, ప్రొఫెసర్లు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, జి.శ్రీనివాస్, ఎ.పున్నయ్య, డాక్టర్ శ్వేత, రాజు తదితరులు పాల్గొన్నారు. పీహెచ్‌డీ సాధించిన రామును రిజిస్ట్రార్‌తో పాటు అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

అనుమతులు ఇవ్వొద్దు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కనీస సదుపాయాలు లేకుండా కొనసాగుతున్న బీఈడీ కళాశాలలకు 2023–24 విద్యాసంవత్సరానికి గాను అనుమతులు ఇవ్వొద్దని టీవీయూవీ, జీవీఎస్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తె యూ రిజిస్ట్రార్ యాదగిరికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్, జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు జైత్రాం రాథోడ్, ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, అజయ్, సుభాష్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

తెయూ(డిచ్‌పల్లి): తమ డిమాండ్లు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెయూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం మానవహారం నిర్వహించారు. 11 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్యాంపస్ ప్రధాన కూడలి నుంచి ర్యాలీగా మెయిన్ గేట్ వద్దకు చేరుకొని మానవహారం నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే అక్టోబర్ 7 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు బట్టు సురేశ్, ప్రధాన కార్యదర్శి బికోజీ, సభ్యులు టి.సురేశ్, సతీశ్, సుధీర్, దిగంబర్, రవీందర్‌నాయక్, సుభాష్‌రావు, గంగాధర్, శ్రీనివాస్, నరేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా జెండా ఉత్సవాలు

- మారుమోగిన గోవింద నామస్మరణ
- ఆలయంలో ఎమ్మెల్యే, మేయర్ పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలో 14రోజులుగా నిర్వహిస్తున్న జెండా బాలాజీ ఆలయ ఉత్సవాలు శుక్రవారం కన్నులపండువగా ముగిశాయి. చివరిరోజు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. అనంతరం జెండాను పోలీసుల బందోబస్తుతో సిర్నాపల్లిగడిలో ఉంచి పూజలు చేశారు. అక్కడి నుంచి గోల్‌హనుమాన్‌కు జెండాను తీసుకురాగా భక్తులు జెండాకు పూజలు చేశారు. అనంతరం జెండా బాలాజీ మందిరం సంగ్వాయ్ వంశీయులు ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి సిర్నాపల్లిగడి, గోల్‌హనుమాన్ మీదుగా పులాంగ్ వాగు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వాగు పక్కన ఏర్పాటు చేసిన స్థలంలో జెండాను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్

జెండా బాలాజీ జాతర ఉత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, నగర మేయర్ దండు నీతూకిరణ్ పాల్గొని జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. జెండా బాలాజీ ఆశీస్సులతో నగర ప్రజలు సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, మేయర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత, ఆలయ కమిటీ చైర్మన్ జాలిగాం గోపాల్, ఈవో గింజుపల్లి వేణు, ధర్మకర్తలు మోర సాయిలు, యమగంటి రాము, పాలకొండ నర్సింగ్, నాయకులు పాల్గొన్నారు.



జెండాను తీసుకొస్తున్న భక్తులు



గోల్‌హనుమాన్ చౌరస్తాలో..



ఫులాంగ్ వరకు జెండాను తరలిస్తున్న భక్తులు



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

భూవివాదంలో ఒకరి మృతి

- మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట నిరసన
- కేశాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి

నిజామాబాద్ రూరల్: భూమి కోసం జరిగిన గొడవల్లో ఓ నిండు ప్రాణం బలైన ఘటన మండలంలోని కేశాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మాయి సత్యంరెడ్డి(52), అదే గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డిలు అన్నదమ్ముల కుమారులు. వీరికి పక్కపక్కనే వ్యవసాయ భూములు ఉండడంతో ఆరేళ్లుగా ఇద్దరికీ సాగు భూముల విషయంలో గొడవలు నడుస్తున్నాయి. ఈ విషయంలో కోర్టులో కేసు నడుస్తోంది. ఇదిలా ఉండగా విఠల్‌రెడ్డి తన 8 ఎకరాల భూమిని పెద్దనాన్న కొడుకైన చిన్నారెడ్డికి కౌలుకు ఇచ్చాడు. అందులో 14 గుంటల భూమి విషయంలో తరచూ సత్యంరెడ్డికి, చిన్నారెడ్డికి గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 19న గ్రామంలోని బెల్టుషాపు వద్ద చిన్నారెడ్డి, అతడి వద్ద పని చేసే గంగాధర్ మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సత్యంరెడ్డితో ఇద్దరూ గొడవకు దిగారు. గొడవలో గంగాధర్ బీరు బాటిల్‌తో సత్యంరెడ్డి తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. సత్యంరెడ్డి కొడుకు ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గంగాధర్, అందుకు కారణమైన చిన్నారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



సత్యంరెడ్డి (ఫైల్)

శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చిన కుటుంబీకులు, బంధువులు సత్యంరెడ్డి మృతికి విఠల్‌రెడ్డియే కారణమని ఆరోపిస్తూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సై మహేశ్‌కుమార్, నలుగురు ఎస్సైలు, సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి నిందితులపై కఠినచర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంత్యక్రియలు శనివారం నిర్వహించనుండడంతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు



విఠల్‌రెడ్డి ఇంటి ఎదుట ఉంచిన మృతదేహం